# నీకు తెలియని నిజం

**'అభిమన్య'**

కోవెల దగ్గర బస్సు దిగినవేళకు బాగా చీకటి పడింది. బ్రీఫ్ కేస్ చేతబట్టుకుని సరాసరి సత్యం ఇంటికే వెళ్ళాను. ఇంటిముందు అరుగుమీద పడక్కుర్చీలో కూర్చుని, దీపం ముందర పేపరు చదువుకుంటున్నాడు సత్యం. నన్ను చూడగానే లేచి నించున్నాడు— 'ఇదేనా రావటం?' అంటూ ప్రశ్నిస్తూ. 'ఔను' అన్నాను తల ఊపుతూ.

'ఇంటికి వెళ్ళొస్తావా?' అన్నాడు సత్యం ప్రయాణంతో బాగా అలిసిపోయి ఉంటానని.

"అవసరం లేదు. ఈ కేసు ఇంట్లో పెట్టి, బాటరీలైటు తీసుకురా" అన్నాను. మనసు ఒకటే ఆరాటంగా ఉంది.

'ఒక క్షణం' అని, లోపలికి వెళ్ళాడు సత్యం. మూడు ముక్కల ఉత్తరం వ్రాసి నన్ను అర్జెంటు ప్రయాణం చేయించిన స్నేహితుడు వాడు. పెద్ద పరిస్తుంది ఉత్తరంతో. హైదరాబాదులోనే ఒక రాత్రంతా నన్ను వెండాడిం దా పరిస్థితి. తీరా సత్యం దగ్గరి కొచ్చాక, వాడి ఉత్తరంలోని టెలిగ్రాముకు అర్థం తెలుసుకోకుండా, ఇంటికి వెళ్ళి వేడినీళ్ళ స్నానం చేయాలన్నంత ఆత్రత నాలో ఏమాత్రం లేదు.

'పద' అన్నాడు సత్యం బాటరీ లైటుతో బయటికొచ్చి. ఎక్కడికి వెళ్ళాలో ఇద్దరికీ తెలుసు. అందుచేత ఇద్దరి కాళ్ళూ అలవాటుగా ఒకే బాటన సాగిపోతున్నాయి. పది నిమిషాలు పట్టింది, ఊరి బయట వేణుగోపాలస్వామి ఆలయం చేరేటప్పటికి. అక్కడికి చేరి, ధ్వజ స్తంభం అరుగు మీదికెక్కి కూర్చునే దాకా ఎవరి నోట ఒక్క మాట బయటికి రాలేదు.

"ఏమిట్రా ఈ బోడి ఉత్తరం? ప్రాణం తినేసింది రాత్రంతా' అంటూ జేబులోని ఇన్‌లాండ్ లెటర్ సత్యం చేతిలో కొట్టాను. బాటరీలైట్ వెలిగించి, తను వ్రాసిన ముచ్చటయిన మూడు ముక్కల్నీ గట్టిగా చదివాడు సత్యం.

'డియర్ వేణూ! ఇక్కడ ఓ పెద్ద ప్రమాదం జరిగిపోయింది. వెంటనే బయలుదేరి వచ్చెయ్! అన్ని సంగతులూ ఇక్కడే తెలుసుకోవచ్చు — సత్యం.'

"ఏమిట్రా! అంత ప్రమాదం? కనీసం సూచనగానైనా రాయకూడదూ?" అన్నాను. కోపం రగులుతూంది.

'నీవు రెక్కలు కట్టుకుని ఇక్కడ వాలాలనే అలా రాశాను. ఇప్పుడు నువ్వు రావటం చాలా మంచిదైంది' అన్నాడు సత్యం, ఏదో భారం దిగిపోయినట్టు ఊపిరి విడుస్తూ, అసలు విషయం గొంతులోనే దాచుకుని.

'సంగతేమిటో చెప్పు ముందర! నిట్టూర్పులు, నిస్పృహలు తరవాత. చిరాగ్గా ఉంది నాకు.'

'నీరజ తెలుసుగా—వెంకటాద్రి గారమ్మాయి?'

'ఆఁ!'

'సుగుణ తెలుసుగా— చలమయ్యగారి కూతురు?'

'ఆఁ!'

'ఆ అమ్మాయి ఈ అమ్మాయిని చంపేసింది.'

'అంటే? !'

'నీరజ సుగుణను కాలువలోకి తోసేసింది!'

అసలు నిజమేమిటోగాని, సత్యం చెప్పిన తీరు నన్ను దిగ్భ్రాంతుణ్ణి చేసింది. మా ఊళ్ళో బి. ఎ. దాకా చదువుకున్న మగాళ్ళం నేనూ, సత్యం. కాలేజీ మెట్లెక్కిన ఆడపిల్లలు నీరజ, సుగుణ. సత్యంతో నా కెంత గాఢమైత్రి ఉందో, ఆ ఆడపిల్లల స్నేహబంధమూ అంతటిదే!

'కారణం తెలుసా?' అన్నాను.

'మొదట నాలుగు రోజుల దాక ఊరంతా అయోమయంలో పడి పోయింది. సుగుణ జాడ తెలియక చలమయ్యగారు పొందిన ఆరాటం అంతా ఇంతా కాదు. మన ఊరికి రెండు మైళ్ళ దూరాన కాలువలో సుగుణ శవం తేలింది. అక్కడి పొలాల్లో రైతులు చూచి సమాచారం చెప్పారు. ఆత్మహత్య అని నిర్ధారణ అయిన తరవాత ఇంటికి తీసుకొచ్చి, అంత్యక్రియ జరిపించారు చలమయ్యగారు. అంత తెలివిగల పిల్ల, అంత తెలివితక్కువ పని చేసిందంటే నా వరకు నేను నమ్మలేదు, వేణూ! ఎంత ఆలోచించినా సరిఅయిన కారణాన్ని ఊహించలేకపోయాను. సుగుణ తల్లిదండ్రులకే మతి పోయినంత పనైంది. వాళ్ళ అవస్థ చూడలేక పోతున్ననుకో.'

చీకట్లో వాడి ముఖంమీద పేరుకు పోతున్న విచారం కనిపించలేదు గానీ, స్వరంలో పూడుకుపోతున్న స్పష్టత నన్ను క్రుంగదీసింది. మాట్లాడటానికి ఇష్టంలేక —'ఊఁ! తరవాత?' అన్నాను క్లుప్తంగా సాధ్యమైనంత నిండు స్వరంతో.

'నాలుగు రోజుల తరవాత సుగుణ ఆత్మహత్య చేసుకోలేదని తేలింది!'

'ఎలా?'

'నీరజ చెప్పింది, తనే బుద్ధిపూర్వకంగా కాలువలోకి నెట్టేశానని. ఓ రాత్రి స్వయంగా వచ్చి నాతో గొల్లున ఏడుస్తూ చెప్పింది.'

నా మెదడు నిప్పుముద్దయి పోయింది. నాలుగు రోజుల తరవాత చెప్పిందంటే అందులో ఏదో రహస్యం ఉండి తీరాలి. అసలు నాలుగు రోజుల తరవాతనైనా ఎందుకు చెప్పాలి? ఆత్మహత్య అని తీర్మానించాక అంత్యక్రియలు జరిగి అందరి దుఃఖం వెనకబడే సమయంలో నింద తనపై మోపుకుంటుందా నీరజ?

'సత్యం, కొంచెం వివరంగా చెప్పరా, నీ ఉత్తరంలా కాక' అన్నాను తెచ్చుకున్న నవ్వుతో.

'నీరజ అంత దారుణానికి ఒడిగట్టటానికి కారణం కొంత నేనూ, కొంత నువ్వూ అని ఊళ్ళో చాలా మంది అభిప్రాయం' అన్నాడు సత్యం. వాడి గొంతు మరీ దిగులు పలుకుతూంది. కూర్చున్న అరుగు కదులు తున్నట్లయింది నాకు.

'చెప్పు' అన్నాను, ఇక నవ్వటం సాధ్యంకాక.

'నీ లాగా హైదరాబాదులోనో, మరొక చోటనో ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక, మన ఊళ్ళోనే ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూట్ పెట్టాను కదా? నీవూ ప్రోత్సహించావు. ఇక్కడ ఏదో తరగతికి మించి చదువు లేదు. టౌనుకు పంపించి పై చదువులు చెప్పించాలనే తాపత్రయం మన జనానికి లేదు. ఇక నువ్వూ నేనూ అంటే మొండికేసి బి. ఎ. దాకా చేరా మనుకో. అలా సు ట్కర్లో చేరి ... కునే వాళ్ళే తక్కువ. ఏడు దాకా ఎగ్రబాకే వాళ్ళు వేళ్ళకన్న ఎక్కువ ఉండరు. కనీసం అలాంటి వాళ్ళకైనా మెట్రిక్‌కోర్సు చెప్పి, సరాసరి పరీక్షకు కూర్చోబెడితే, సొంత ఊరునన్నా ఆ మేరకు ఉద్ధరించిన వాడి నవుతాననుకున్నా. తద్వారా పొట్ట పోసుకోవటం నా ప్రథమ లక్ష్యం. అదే పరమ లక్ష్యమనుకున్నా ఇబ్బంది లేదు. నీవూ ఎన్నోసార్లు ఇక్కడి కొచ్చినప్పుడు పిల్లలకు పాఠాలు చెప్పావు కదా! మనల్ని ఆదర్శంగా తీసుకున్నారో లేక మనలాగే మొండికేశారో గానీ, నీరజ, సుగుణలు కూడ టౌనుకెళ్ళి హైస్కూల్లో చేరిన సంగతి నీకు తెలుసు. రోజూ పొద్దున్నే స్కూలుకు వెళ్ళి, సాయంత్రానికి ఇంటికి తిరిగొస్తుండే వాళ్ళు. ఇద్దరూ తెలివిగల వాళ్ళే. స్కూలు చదువుతో తృప్తి పడక మన ఇన్‌స్టిట్యూట్‌లోకూడా చేరారు. వాళ్ళకు చదువుపట్ల ఉన్న శ్రద్ధ, పోటీ మనల్ని ఆశ్చర్యపరుస్తుండేవి. ఉద్యోగం హైదరాబాదులో అయినా, నీ ప్రాణం ఎప్పుడూ మన ఊరి మీదనేగా!! సంవత్సరానికి పది సార్లన్నా వచ్చి పోతుంటావు. నీవు ఇక్కడుండే పది రోజులూ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఎక్కువ కాలం గడపటం నీకు హాబీ. ప్రత్యేకంగా నీరజ, సుగుణ నీవు ఉన్నన్నాళ్ళూ నీ చుట్టే మూగేవాళ్ళు. నీవూ ఎంతో శ్రద్ధగా, బాధ్యతగా తెలియనివి చెప్పేవాడివి. నాకూ ఎంతో ఆనందంగా ఉండేది! అయితే, ఒక విశేషమేమంటే, అన్ని పరీక్షల్లోనూ నీరజకంటే పై చేయిగా ఉండేది సుగుణ. ముఖ్యంగా వాళ్ళు ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతుండగా ఇద్దరి మధ్య పోటీ తీవ్రమైంది. నీరజను మనం చాలా సార్లు నవ్వించాం. సుగుణ కన్న నించి మార్కులుతెచ్చుకోలేవని పందెంకాస్తుండే వాళ్ళం. దాన్నే ఛాలెంజీగా తీసుకుని మరీ పట్టు పట్టి చదివేది నీరజ. అంతే గాని, మచ్చుకైనా ఈర్ష్యాద్వేషాలు మనసులో అంకురించిన ఛాయలే కనపడలేదు. ఆఖరుకు ఎస్. ఎస్. ఎల్. సి. ఇద్దరూ డిస్టింక్షన్ మార్కులతో పాసవటం, ఒక సంవత్సరం కాలేజీచదువుకూడా పూర్తయి, రెండో సంవత్సరం సగం గడిచిపోవటం కూడా జరిగింది! ఇందులో నీకు తెలియని విషయాలు ఏ కొద్దో గొప్పో ఉన్నా, టూకీగా కథంతా తెలుసు!' అంటూ అరుగుపైన వెల్లకిలా పడుకున్నాడు, సత్యం, నిలువెల్లా నీరసం చుట్టేసినట్లు.

నుదుటిని ఎడమ అరచెయ్యి పెట్టుకున్న తీరు చూస్తే, ఏదో పుణ్యమని పాఠాలు చెబితే, పాపం పంకిలంలా అంటుకుం దేమిరా, దేవుడా' అని లోపల గగ్గోలు పడుతున్నాడనిపించింది నాకు. నా పరిస్థితి వేణూ, వాడి స్థితికి జాలి పడేటంత గుండె దిటవు లేదు. చప్పుడు నన్నగిల్లు తూంది! వా డింకా ఏవో భయంకరమైన నిజాలు చెపుతాడని హృదయం నిండా మెండైన ఆందోళన!

'ఇంతకూ నీరజ నీతో ఏం చెప్పింది?' అన్నాను గంభీరంగానే.

''సుగుణ చనిపోయిన తరవాత ఎక్కువ కాలం ఇన్‌స్టిట్యూట్‌లోనే ఒంటరిగా గడుపుతున్నా, వేణూ! ఇంటి పద్దు ఉండ బుద్ధవటం లేదు. ఆ రోజు రాత్రి. . . బహుశా పది గంటలు అయి ఉండచ్చు— ఇన్‌స్టిట్యూట్ ముందర ఈజీచెయిర్ వేసుకుని విచారంగా పడుకున్నా. నా విచారమంతా సుగుణను గురించే. అలా కాలవలో దూకి ప్రాణత్యాగం చేయవలసిన దుర్భర పరిస్థితులు ఏమి ఉండి ఉంటా యని శోధన ప్రారంభించింది మనసు. నో! అంతు చిక్కలేదు. నీ కేమైనా తెలిస్తే చెప్పరా!' ప్రాధేయ పూర్వకంగా అడిగాడు సత్యం. చెప్పవలసింది ఆపి, మధ్యలో ప్రశ్న వేస్తున్నందుకు నాకు మరీ బేజారుగా ఉంది!

'నాకుమాత్రం ఏం తెలుసు?' అన్నాను మనసులోని రియాక్షన్ను కసిగా చంపేస్తూ.

'నేనూ అదే అనుకున్నాలే. అప్పు డొచ్చింది నీరజ నా దగ్గరికి. చెప్పద్దూ, నా శరీరమంతా మంచుకొండ అయిం దనుకో, వేణూ! ఎంత గురుశిష్య బాంధవ్యమైనా, ఆ సమయంలో నీరజ




అలా ఒంటరిగా రావటం నాకు నచ్చలేదు. నచ్చకపోతే ఏడ్చిందెవడుగాని, వాతావరణం కలుషితమయిపోయింది గదా. నానా ర్థాలూ తీసే జనానికి ఎంత మంచి అవకాశం!

'ఏమిటి ఇలా వచ్చావు, నీరజా?' అన్నాను కంగారుగానే లేచి, లోపలికి దారితీస్తూ. నీరజ నా వెంట లోపలికి రావటానికి భయపడలేదు. ఎప్పటినుంచి కన్నీళ్లకు వారధి కట్టిందో, 'మాస్టారూ!' అంటూ కూలిగొట్టింది!

'అందరూ దుఃఖాన్ని మరిచిపోయే ప్రయత్నంలో ఉంటే, నీ కిప్పుడీ వేద నేమిటి, నీరజా?' అన్నాను. అంతే తోచింది నాకు.

'మీ కో నిజం చెప్పాలి మాస్టారూ! ఈ నాలుగు రోజుల నుంచి నేను పడు తున్న మానసిక హింస ఎవరితో చెప్పినా తీరదు, మీకు తప్ప. మీకైతేనే సుల భంగా అర్థమవుతుంది. నేను కావాలనే సుగుణను కాలేజీ నుంచి వచ్చేటప్పుడు కాలువలోకి నెట్టేశాను. .ఎందుకంటే, మా మధ్య నానాటికీ పెరుగుతున్న ద్వేషం! ఎస్. ఎస్. ఎల్. సి. లో అంకు రించిన అసూయ మొన్న మొన్నటికి పరాకాష్ఠ చెందింది! ఆశ్చర్యంగా ఉంది కదూ, మాస్టారూ? నా బాహ్య ప్రవర్తనే అందుకు కారణం. పాపం, సుగుణకూ తెలియదు, నేను దానిపట్ల శత్రుత్వం వహిస్తున్నానని. అది నా కంటే తెలివి గలదిగా పుట్టి ఉండకున్నా, మీరు మా మధ్య పోటీ తత్వాన్ని ప్రేరేపించ కున్నా, నే నీ అకృత్యం చేసి ఉండేదాన్ని కాదేమో? కాని, మాస్టారూ, ఇందులో మీ బాధ్యత చాలా స్వల్పం. మా మంచి కోరి, మా ఉన్నతిని ఆశించి మీరూ, వేణూ కూడా ఎన్నోమార్లు నన్ను కవ్వించారు. అయితే, నాలో జ్వలిస్తున్న అసూయను మీరు పసికట్ట లేదు. మీరేమిటి, అహర్నిశలూ ఒకటిగా మసలిన సుగుణే గ్రహించలేకపోయింది. ఈ విషయంలోనైనా నేను దాని కంటే తెలివిగలదాన్నని నిరూపించుకున్నాను. అంత చాకచక్యంగా నటించాను.

అది పోయిన తరవాత తెలిసింది మాస్టారూ, అది లేని లోటు, ఒక శరీరంలో సగం తెగిపోయినంత నరకంగా ఉంది నాకు. నిజాన్ని దాచటం వల్ల ఈ సగం శరీరం కుళ్లిపోతుందని భయం. అందుకే మీకు నిజం చెప్పి, క్షమాపణ వేడుకోవాలని వచ్చాను' అంటూ నా కాళ్ల దగ్గర వాలింది నీరజ. వేణూ!, నీరజ అన్నట్లు మన బాధ్యత — పోనీ నా బాధ్యతే అనుకో — స్వల్పమైనా, అనల్పమైనా హాని చేసింది సుగుణకు. చదువు చెప్పడమంటే, కేవలం పుస్తకాల్లోని పాఠాలు నూరిపోయడమే కాదను

కుంటాను. ఇంకా ఏదో ఉంది నాకు తెలియనిది. నా పొరపాటువల్లనే నీరజ అవ్యక్తురాలైంది. ఇక ఇన్‌స్టిట్యూట్ నడప దలుచుకోలేదు, వేణూ!'

"పోనీ, ఏదో ఉద్యోగంలో చేరుదువు గానిలే" అని సలహా పారేసేవాణ్ణే మరో కప్పుడయితే! అరికాళ్లకు చమట పడుతూంది! కణతలు కటకటలాడుతున్నాయి. వాడా నీరసంలోనే అకస్మికంగా బాంబు పేల్చి నా గుండెలు బద్దలు చేస్తాడన్న నమ్మకం ఇంకా చావలేదు వాడు కథనం చెప్పే ధోరణిని బట్టి!

"ఇక నా సంగతి చెప్పు" అన్నాను సిద్ధపడే. లేచి కూర్చున్నాడు సత్యం. వీపు నెప్పి పుట్టింది కాబోలు.

"ఏముంది? నీవు కలవారి బిడ్డవు. కాలక్షేపంకోసమో, సరదాకో ఉద్యోగం చేస్తున్నావు. మళ్లీ ఒక చెంప ఊరిమీద, ఊళ్లో మనుషులమీద వల్లమాలిన మమకారం! జీతం నష్టంమీదైనా తోచనప్పుడల్లా ఇక్కడికి వొచ్చి పది రోజులు గడిపి పోతుంటావు. నీరజ, సుగుణ నీ బంధువర్గంలోని వాళ్లు. కాకపోతే సిరిసంపదల్లో కొంచెం తారతమ్య ముందనుకో. కాలేజీలో చదువుకుంటున్నారు. ఆ చదువే లేకపోతే, ఈ కథే లేదనుకో! వాళ్లిద్దరూ ఏకంగా నిన్ను ప్రేమించి ఉంటారని, ఈ రూపంగా జయాపజయాలు తేల్చుకున్నారని కొందరు పెద్దల అభిప్రాయం. కుర్రాళ్లయితే ఖచ్చితమైన నిర్ణయం చేశారు, ప్రేమ వ్యవహారమని. ఇదీ నాకు అంటగట్టినందుకు చాలా సంతోషిస్తున్నాను. కాదని బుజాను చేసుకోవలసిన అవసరం నీకు లేకపోయినా, నలుగురు పెద్దల చెవిలో వేసి, వాళ్లకి మన స్నేమితం చేకూరిస్తే మంచిదని నిన్ను రమ్మని రాశాను' అంటూ ముగించాడు సత్యం, ధ్వజస్తంభాని కానుకుంటూ. అప్పు డనిపించింది నాకు, టెలిగ్రామ్ లాంటి ఉత్తరం కాక, టెలిగ్రామే ఇచ్చి ఉండవలసింది వాడని! అప్పటి వరకూ నా హృదయా న్నావరించిన చీకటి పెట్లిపోయిందని చెప్పటాని కన్నట్లు, ఆకాశంలో వెలుగును ప్రసరిస్తూ చుక్కలు జట్లు జట్లుగా బయటి కొస్తున్నాయి!

'ఇక వెళదామా, సత్యం?' అన్నాను సంగీతం పాడే వాడిలా గొంతు సవరించుకుని.

'నీ ఇష్టం' అన్నాడు సత్యం చీకటి దారిని బాటరీ లైటు పరుస్తూ.

సత్యం ఇంటికి వెళ్లి బ్రీఫ్ కేసు తీసుకుని మా ఇంటికి చేరుకునేసరికి పదకొండు దాటిపోయింది.

అంతిలం

వనం పూర్తిగా సుఖపడలేక పోవడానికి అవరోధం ఒక్కటే. మనకు ఉన్నదానిపై నిర్లక్ష్యం, లేనిదానిపై ఆరాటం.

—రిచూ

* * *

సెలవుపెట్టి రాలేదు కాబట్టి, హైదరాబాదు ఎప్పుడు వెళ్లాలన్న నిర్ణయం కాలేదు. అయినా, మరి నాలుగు రోజుల కంటే ఎక్కువ ఉండలేక పోయాను అక్కడ. ఏకాంతంగా నీరజతో మాట్లాడాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. అస్తమానం ఇంట్లోనే ఉంటున్నది. కాలేజీ మానేసింది. లోకందృష్టిలో తను నేరస్థురాలిగా పరిగణింపబడటం భరించలేక, ముఖం చూపించలేక పోతూందని ఊహించాను. నాకై నేను వాళ్లింటికి వెళ్లి పలకరించటానికి మనస్కొప్ప లేదు. ఇక నేను చేసిందల్లా నలుగురు పెద్దలకీ నచ్చచెప్పటం. వాళ్ళు నన్ను ప్రేమించట మేమిటీ, పైగా కొద్దో గొప్పో బీరకాయ పీచులాంటి బంధుత్వం కూడా ఉందని అందరికీ తెలిసిన నిజమే అయినా, మళ్లీ కొత్తగా చెప్పవలసి వచ్చింది. ఆ మధ్య మా నాయన, నీరజ తండ్రి మా ఇద్దరికీ ముడిపెట్టాలని ఒకటి రెండు సార్లు ప్రస్తావించుకున్న సంగతి కూడా అమ్మ చెప్పింది నాకు. నేనేం సమాధానం చెప్పలేదు. నా అభిప్రాయం నిలదీసి ఎవ్వరూ అడగలేదు కాబట్టి. బహుశా నీరజకు కూడా తన వివాహ ప్రసక్తి తెలిసే ఉండచ్చు. ఈ అపభ్రంశం జరిగాక, నేను తన పట్ల విముఖత చూపుతానని అనుకోకుండా ఉంటుందా? ప్రాణస్నేహితురాలి నిండు ప్రాణాల్ని బలితీసుకున్నదని తెలిసిన ఏ మగవాడు తన్ను అంగీకరిస్తాడు? అని తన్ను తాను ప్రశ్నించుకోకుండా ఉండ లేదు. సమాధానం తీరని వ్యథ! మా తలిదండ్రుల ఆలోచన ఆచరణరూపం ధరించే పక్షంలో నీరజ ఏమంటుందో? అప్పుడు నా కర్తవ్యం ఏమిటి? కాలం కలిసి వస్తే నీరజను పెళ్లాడటం నాకు ఇష్టమే! నీరజమాత్రం సంతోషించ కుండా ఉంటుందా? కాని ... తన్ను గూర్చి నేను ఒక అపోహని పెంచుకుంటున్నానని భ్రమపడుతుండవచ్చు? నిరాకరిస్తానని భయపడుతూ ఉండచ్చు. నిజంగా నిరాకరిస్తే నీరజకు ఆత్మహత్యే శరణ్యం! అన్ని రకాల ఆలోచనల అలలతో మన సొక పెద్ద సుడిగుండంలా తయారైంది.నాకు. ఆ సుడిగుండంలోనుంచి ఎలా బయట పడాలా అన్న తపన తోనే బస్సెక్కాను. ఉద్యోగం సరిగా చెయ్య గలనో లేదోనని అనుమానం పీడిస్తూనే ఉంది.

బస్సు దిగి రూముకు వెళ్లాను, ఉదయం ఎనిమిది గంటలవుతుండగా. ఒక గంటలో తయారయి ఆఫీసు కెళ్లిపోవాలని తాపత్రయం,తాళం తీసి లోపలికి వెళ్లగానే కిటికీలు తెరిచాను. చేతిలో ఉన్న బ్రీఫ్‌కేస్ మంచం మీద పెట్టి, బూట్లు విప్పుకుంటున్న నాకు వాకిటి దగ్గర అలికిడి వినిపించింది. తలఎత్తి చూశాను. ఇంటివాళ్ల పెద్దమ్మాయి చేతిలో కవరు పెట్టుకొని రెడీగా నిలుచుని ఉంది. నా ఉత్తరాన్ని నాకు శ్రద్ధగా అందజెయ్యటంలో ఆ అమ్మాయి కున్నంత ఇంటెరెస్టు బహుశా పోస్టుమన్‌కు కూడా ఉండక పోవచ్చు. సాక్సు ఊడదీసి మంచం కిందికి పారేసి, వెళ్లి కవరు తెచ్చుకున్నా, ఆ అమ్మాయి కో నవ్వును ప్రసాదించి — అలవాటుగా.

కవరు బరువుగా ఉంది. పైన ఫ్రమ్ అడ్రెస్ లేదు. పల్స్ పరుగెత్తుతూంది. పొద్దుటి పూట దాని వేగం మరీ ఎక్కువ ఉద్యోగస్థుల్ని ఏడిపించటానికి పోటీ పడదాంలే అనుకుని కవరు చించాను.

'వేణూ! నీవు హైదరాబాదు చేరే టప్పటికే నీ కీ ఉత్తరం అందాలనే ఆరాటం కొద్దీ, నీ విక్కడ ఉండగానే వ్రాసి పోస్టు చేశాను. ఇక్కడున్న నాలుగు రోజులూ నన్ను గూర్చి చాలా తెలుసుకుని ఉంటావు. ఎన్నో రకాలుగా ఆలోచించి ఉంటావు. వాటన్నిటినీ ఒక పక్కన పెట్టేయి! పాపం, సుగుణ చనిపోయింది! ఆత్మహత్య చేసుకుందని మొదట్లో అంతా భావించారు. కాదు, హత్య చేశానని నేను మాస్టారికి చెప్పటంతో అందరి దృష్టిలో నేను పలచనై పోయాను. అయినా, నేను బాధపడటం లేదు. ఎందుకంటే, సుగుణ తెలివికల పిల్ల! అమాయకురాలు! దానికి జరిగిన అన్యాయానికి నా జీవితాన్నే త్యాగం చెయ్యాలని సంకల్పించుకున్నా! నా నిర్ణయం తిరుగులేనిది! నేను నేరం చేసినట్లు నాలుగు రోజులు ఆలస్యంగా ఎందుకు ఒప్పుకున్నానా అని కొందరు సందేహించారు. వాళ్లకి సమాధానం నా వద్ద లేదు. కానీ, ఆ నాలుగు రోజులు సుగుణను గురించి, దాన్ని శీలాన్ని గురించి బొడ్డూడని పెధవల దగ్గరినుంచీ అసహ్యకరంగా చెప్పుకోవటం విని, సహించలేక పోయింది నా మనసు. తన్ను గురించి అలాంటి జుగుప్సాకరమైన ప్రచారానికి తావివ్వవద్దని నాతో ప్రామిస్ చేయించుకుంది సుగుణ. నిజమే, అది కాలుజారింది. ఏ పరిస్థితుల్లో కన్యాత్వాన్ని మంట కలుపుకుందో వివరంగా చెప్పింది నాకు కాలువ గట్టున. పర్యవసానాన్ని ఊహించలేక పోయానని గుండె పగిలేట్లు ఏడ్చింది. ఆ దౌర్భాగ్యు డెవరో చెప్పమని ఒత్తిడి చేశాను నేను. చెప్పింది! ఎంతో ధైర్యం నూరిపోశాను. నిబ్బరంగా ఉండమని హృదయంలో ఇముడ్చుకుని మరీ ఉపదేశించాను. అన్నిటికీ తల ఊపింది సుగుణ. నన్ను నమ్మించింది! కానీ, అలా ఆత్మహత్యకు పాల్పడి నన్ను మోసం చేస్తుందని కలలో కూడా అనుకోలేదు! మరణించిన దాన్ని గురించి అనవసరమైన పుకార్లు వ్యాపించ వనుకున్నాను. అందుకు విరుద్ధంగా మన ఊరి జనం సుగుణను నీచంగా చిత్రించసాగారు. కర్తవ్యం నా వెన్ను తట్టింది! సుగుణకు ఇచ్చిన ప్రామిస్ పాదరసంలా శరీరమంతా పాకింది! ఆ పుకార్లను ఎలా మసిపూసి, మాయం చేయాలో నాలుగు రోజులు తీవ్రపోరాటం జరిగితే కాని మనసుకు తట్టలేదు. సత్యం మాస్టారికి మనస్తాపం కలిగించటం అనివార్య మైంది. ఆయన ఆమాత్రం భరించగలడనే నా విశ్వాసం.

ఇంతవరకూ వ్రాసిన విషయాలు నీకుతెలిసినవే. కంగారు పడుతున్నావా, వేణూ? నీవు ఎంతో మంచివాడివి! పది మంది చేత మంచివాడుగా కీర్తించ బడాలనే ఆశాజీవివి! సగటు మనిషివి! అందుకే సుగుణ గర్భవతయింది! ఎలానంటావా? మామూలు సినిమా క ! హీరో నువ్వే కదూ? అవును, నువ్వే ! ! మన సినిమా హీరో పాత్రల ఒరవడినే పాడుచేసిన ఘనత దక్కించుకున్నావు. అభినందిస్తున్నాను.

ఆఖరిని మరో ముఖ్య విషయం: మన పెద్దలు మనిద్దరికీ దాంపత్యం అంటగట్టాలని సమాలోచనలు జరుపుతున్న వార్తలు అందుతున్నాయి! నిన్ను మీ వాళ్ళు అభిప్రాయం అడిగినప్పుడు ఖచ్చితంగా వ్రాసేయ్ — నీరజను పెళ్లి చేసుకోవటం ఇష్టంలేదని! నీ మంచి సమాధానం కోరని...

—నీరజ.' ★